## ప్రాణం తీసిన భూతగాదా

- అన్నను హతమార్చిన తమ్ముడు



రాంరెడ్డి మృతదేహం

ఆత్మకూరు, జూన్ 19 : సొంత అన్నను తమ్ముడు హత్య చేసిన ఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్లలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మూలమల్లకు చెందిన పాకనాటి రాంరెడ్డి (63), అతడి తమ్ముడు పాకనాటి శ్రీనివాస్‌రెడ్డి మధ్య కొన్నేండ్లుగా భూవివాదాలు ఉన్నాయి. నాలుగేండ్ల కిందట ఒకరిపై ఒకరు గొడ్డళ్లతో దాడులు చేసుకొని గాయపడ్డారు. నాటి నుంచి భూతగాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి మరోమారు వ్యవసాయ పొలం వద్ద అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. ఈ గొడవను గుర్తించిన స్థానికులు రాంరెడ్డి కుమారుడికి సమాచారం ఇచ్చారు. అతడి కుమారుడు శేఖర్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లే సరికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అర్ధరాత్రి సీఐ కేఎస్.రత్నంతోపాటు ఎస్సై, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వ్యవసాయ పొలంలోని బావిలో గాలించగా రాంరెడ్డి మృతదేహం లభ్యమైంది. మృతదేహంపై బలమైన గాయాలు ఉన్నట్లు గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు మార్చురీకి తరలించారు. శేఖర్‌రెడ్డి పొలం వద్దకు వచ్చినప్పుడు తన చిన్నాన్న శ్రీనివాస్‌రెడ్డి గ్రామంలోకి వెళ్తుండడాన్ని గుర్తించినట్లు పోలీసులకు తెలిపాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## నిప్పంటుకొని మహిళ మృతి

ఊట్కూర్, జూన్ 19 : వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని మహిళ మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై అఫ్జల్ కథనం మేరకు.. స్థానిక రుద్రానగర్‌లో నివాసముంటున్న మంగలి నారమ్మ (53) ఆదివారం రాత్రి గ్యాస్ సిలిండర్‌పై వంట చేస్తుండగా, చీరకు నిప్పంటుకున్నది. గమనించిన ఆమె కుమారుడు నరేశ్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించేలోపు మృత్యువాత పడినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దకొత్తపల్లి, జూన్ 19 : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెద్దకొత్తపల్లి మండలం పెరుమాళ్లపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై రాజుయాదవ్ కథనం మేరకు.. పెరుమాళ్లపల్లికి చెందిన నల్లవెల్లి వెంకట్‌రెడ్డి (40) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుమతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో మెకానిక్‌షాపు దగ్ధం

రేవల్లి, జూన్ 19 : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మెకానిక్ షాపు దగ్ధమైన ఘటన రేవల్లి మండలం చెన్నారంలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. చెన్నారం గ్రామానికి చెందిన ఎండీ వజీర్ అహ్మద్ మెకానిక్ షాపులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి పనిముట్లు ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో దాదాపు రూ.లక్షా 50వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

## కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

శ్రీరంగాపూర్, జూన్ 19 : కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన శ్రీరంగాపూర్ మండలం జానంపేటలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. జానంపేట వాసులు రామచంద్రయ్యకు చెందిన 15 గొర్రెపిల్లలు, వెంకటయ్యకు చెందిన 10, రాముడుకు చెందిన 10 గొర్రెపిల్లలపై కుక్కలు దాడిచేయడంతో మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గొర్రెపిల్లలతో బాధితులకు రూ.70వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## రేపటి నుంచి డీఈఈ సెట్ కౌన్సెలింగ్

పాలమూరు, జూన్ 19 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డీఈఈ సెట్–2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 21 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మేరాజుల్లాఖాన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో అడ్మిషన్ల కోసం ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమోస్, 4నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల తదితర ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9949993714 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# పురిట్లోనే చంపేస్తున్నారు!

- గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు
- రూ.8వేల వరకు వసూలు
- వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాకం
- పట్టించుకోని అధికారులు

**ఆడపిల్లలంటే ఇష్టంలేదని కొందరు.. తప్పు చేసి గర్భందాల్చి మరికొందరు.. కారణమేదైనా పురిట్లోనే పసికందును చిదిమేస్తున్నారు.. వివిధ కారణాలతో గర్భందాల్చిన వారు, ఆడబిడ్డ ఇష్టం లేక, ఇతరాత్ర కారణాలతో వచ్చిన వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వైద్యులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు వ్యాపారంగా మలుచుకుంటున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిసినా జోగుళాంబ గద్వాల జిల్లాలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

**- గద్వాల అర్బన్, జూన్ 19**





జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుగా చేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి పలు స్కానింగ్ సెంటర్లు, దవాఖానల నిర్వాహకులు కడుపులో పెరుగుతోంది ఆడబిడ్డా, మగబిడ్డా అనేది ప్రసావానికి ముందే నిర్ధారిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య తక్కువగా నమోదవుతున్నది. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తగ్గుతున్న బాలికల సంఖ్య

గతంతో పోలిస్తే బాలికల జనాభా చాలా తక్కువ ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ కారణంగా ప్రస్తుతం 10మంది యువకులకు నలుగురు చొప్పున అమ్మాయిలు ఉన్నట్లు సమాచారం. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తేలితె వెంటనే అబార్షన్ చేయించడంతో బాలికల సంఖ్య తక్కువగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### అవసరాలే ఆసరాగా..

గద్వాల, అలంపూర్, అయిజ పట్టణాలతోపాటు పలు ప్రాంతాల్లో ప్రైవేట్ దవాఖాన, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని బోర్డులు ప్రదర్శిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పలువురు అర్‌ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులు, ఆశ కార్యకర్తలు, కొంతమంది వ్యక్తులను నియమించుకొని పలువురు లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దంపతుల అవసరాలను ఆసరాగా చేసుకొని దాదాపు రూ.3వేల నుంచి రూ.8వేల వరకు పరీక్షల కోసం డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తొలి కాన్పులో ఆడపిల్ల పుట్టి రెండు, మూడోసారి గర్భందాల్చిన మహిళలు లింగ నిర్ధారణకు అధికంగా వస్తున్నారు.


### ఇష్టారీతిగా అబార్షన్లు..

జిల్లాకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో దవాఖానల నిర్వాహకులు ఇష్టారీతిగా అబార్షన్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వివాహేతర సంబంధాల వల్ల గర్భందాల్చిన మహిళలు, ఇతర కారణాలతో మరికొందరు అబార్షన్లకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గర్భిణులు ఆరోగ్యపరంగా తప్పనిసరి పరిస్థితుల్లో అబార్షన్ చేయించుకుంటే వైద్యాధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాల్సి ఉండగా, నిబంధనలను పట్టించుకోవడం లేదు.

### నిబంధనలు ఇవి..

కడుపులో పెరుగుతున్న బిడ్డకు జన్యుపరమైన లోపాల కోసం, శిశువు పెరుగుదల ఎలా ఉందో తెలుసుకునేందుకు మాత్రమే పరీక్షలు నిర్వహించాలి. కడుపులోని బిడ్డ ఆడో, మగో ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదు. లింగ నిర్ధారణకు సహకరించిన వారికి 3నెలల జైలు, రూ.10వేల జరిమాన విధిస్తారు. రెండోసారి సైతం ఇదే తప్పు చేసిన వారికి ఐదేండ్ల జైలుశిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధించే అవకాశముంది. వైద్యులు దోషులుగా తేలితే లైసెన్స్‌ను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సిఫార్సు చేసి కొద్దిరోజులు రద్దు చేసే అవకాశముంది. గర్భంలోని శిశువుకు లింగ నిర్ధారణ చేయమని కోరినా మూడేండ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టాల్సిన అవసరం ఉన్నది.

### లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం



దవాఖానలు, స్కానింగ్ సెంటర్లల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధం. ఎవరైనా పరీక్షలు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేపడుతున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఎంతటివారైనా సహించేదిలేదు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

**- శశికళ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి, జోగుళాంబ గద్వాల**

## రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో చోరీ

- రూ.19లక్షల 50వేలు చోరీ చేసిన నేపాల్‌వాసులు
- ఆలస్యంగా వెలుగులోకి..

ఉండవెల్లి, జూన్ 19 : మండలంలోని ఇటిక్యాలపాడు రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో చోరీ జరిగిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, విశ్వసనీయవర్గాల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కోమ్రోలు మండలం గుంరెడ్డి గ్రామానికి చెందిన వ్యాపారులు నర్సింహ, షరీఫ్ రైతులతో మిర్చిని కొనుగోలు చేసేందుకు రూ.18లక్షలతో శనివారం ఇటిక్యాలపాడు రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్‌కు వచ్చారు. రాత్రి 9గంటలు కావడం, రైతులు లేకపోవడంతో అక్కడే ఉన్న కోల్డ్ స్టోరేజ్ యజమాని రాంచంద్రారెడ్డికి రూ.18లక్షల నగదును ఇచ్చి ఉదయం తమకు ఇవ్వాలని కోరారు. అయితే స్టోరేజ్ యజమాని బీరువాలో డబ్బులను దాచి ఆఫీస్‌రూం తాళాలను అక్కడే మర్చిపోయి గుమస్తా మధుతో కలిసి ఇంటికి వెళ్లిపోయారు. ఉదయం వచ్చి చూడగా, ఆఫీస్‌రూంలోని బీరువా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. అందులో దాచి ఉంచిన రూ.18లక్షలు, కోల్డ్ స్టోరేజ్‌కు సంబంధించిన రూ.లక్షా 50వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీ జరిగిన రాత్రి నుంచి రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన నైట్ వాచ్‌మెన్ కమల్, అతడి భార్య, అమ్మానాన్న, హోటల్‌లో పనిచేస్తున్న మరోజంట (వాచ్‌మెన్ బంధువులు) కనిపించకుండా పోయారు. కోల్డ్ స్టోరేజ్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ భాస్కర్‌కు వాచ్‌మెన్, అతడి భార్య, మరోజంట రాత్రి ఒంటిగంటకు కొత్తకోటకు వెళ్లి వస్తామని చెప్పి వెళ్లిపోయినట్లు యజమానికి తెలిపారు. సీసీ పుటేజీని పరిశీలించగా, వాచ్‌మెన్, అతడి భార్యతోపాటు మరో మహిళ నగదు చోరీ చేస్తున్న దృశ్యాలు రికార్డు కావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించి రహస్యంగా విచారణ కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చోరీకి పాల్పడిన నేపాల్ వాసులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు. దీనిపై ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, నగదు చోరీకి గురైన విషయం వాస్తవమేనన్నారు. వ్యాపారి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

## సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూన్ 19 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగ రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం కొనసాగింది. జిల్లా పోలీసు కార్యాలయంలో చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఎస్పీ కె.నర్సింహ పర్యవేక్షించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యానికి గురికాకుండా సర్టిఫికెట్ల పరిశీలనను వేగంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టీఎస్ఎల్‌పీఆర్‌బీ నిబంధనల మేరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. జిల్లా పరిధిలో మొత్తం 550మంది అభ్యర్థులకుగానూ 490మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏవో రుక్మిణీబాయి, సాయుధ డీఎస్పీ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ యోహోవాదాస్, ఐటీసెల్ సిబ్బంది, పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## 'దూప దీపం' పథకానికి 44 ఆలయాలు

పెబ్బేరు, జూన్ 19 : దూప దీప నైవేద్య పథకానికి జిల్లావ్యాప్తంగా కొత్తగా మరో 44 ఆలయాలను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు జిల్లా దూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు చెప్పారు. సోమవారం ఆయన పెబ్బేరులో మాట్లాడుతూ ఈ పథకం కోసం ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఉత్తర్వులు వెలువడినట్లు పేర్కొన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనం ప్రారంభోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. ఈ పథకం కింద అర్చకులకు ఇచ్చే వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచిన విషయాన్ని గుర్తు చేస్తూ.. బ్రాహ్మణులు సీఎం కేసీఆర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటారని చెప్పారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు నటరాజు, ప్రధానకార్యదర్శి రవీంద్రరావు ఉన్నారు.